సాక్షి
అనకాపల్లి
మంగళవారం। 20। ఆగస్టు। 2024




పునరావృతం కాకూడదు

అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 143 వినతులు అందాయి. 8లో



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

విశాఖ: పోర్టు స్టేడియంలో ఈ నెల 26 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరేందిరప్రసాద్ తెలిపారు.



కొవ్వొత్తులతో నిరసన

విశాఖ: వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ.. స్టాఫ్ నర్సులు సోమవారం సాగరతీరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

విషాహారంతో విషాదం

పాపం పసివారు!

- అశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ముగ్గురు చిన్నారుల మృతి
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 35 మంది
- ఫంక్షన్లో మిగిలిపోయిన బిర్యానీ పెట్టడమే కారణం
- అస్వస్థతకు గురైనా.. స్పందించని ట్రస్ట్ నిర్వాహకుడు
- కారణం చెప్పకుండా ఇళ్లకు పంపించేయడంతో దారుణం



విశాఖ కేజీహెచ్‌కు చేరుకున్న బాలికను ఎత్తుకొని వార్డుకు చేరుస్తున్న సిబ్బంది



నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు





విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కలుషితాహార బాధితులు

అభం శుభం తెలీని గిరిజనులు వారు.. అభివృద్ధికి, విద్యావకాశాలకు దూరంగా బతుకుతున్నారు.. తమ బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని ఆశ పడ్డారు.. మిషనరీ సంస్థ మైదాన ప్రాంతంలో నడుపుతున్న హాస్టల్లో వారిని చేర్చారు. చక్కగా చదువుకొని పైకి వస్తారన్న నమ్మకంతో ఉన్న సమయంలో అస్వస్థతతో చిన్నారులు ఇంటికి తిరుగుముఖం పట్టారు. గంటలు గడిచేలోగానే వారి పరిస్థితి విషమించడంతో గిరిజనం బెంబేలెత్తిపోయారు. ముగ్గురు చిన్నారులు విగత జీవులు కావడంతో మన్యం మూగబోయింది. చికిత్స పొందుతున్న 35మంది పిల్లలు క్షేమంగా ఇంటికి తిరిగిరావాలని కన్నీటితో వేడుకుంటోంది.

కోటవురట్ల/నర్సీపట్నం/మహారాణిపేట (విశాఖ): ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యం ముగ్గురు చిన్నారుల ప్రాణాల్ని బలి తీసుకుంది. వారి తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చింది. ఓ ఫంక్షన్లో మిగిలిపోయిన బిర్యానీని పెట్టడం వల్లే పిల్లలు అస్వస్థతకు గురైనట్లు తెలిసినా నిర్వాహకులకు పట్ట లేదు. కనీస బాధ్యత లేకుండా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న పిల్లల్ని తల్లిదండ్రులకు అప్పగించి చేతులు దులిపేసుకోవాలనుకున్నారు. ఈ నిర్లిప్తతే ముగ్గురి ప్రాణాల్ని పొట్టనబెట్టుకుంది. ఉమ్మడి విశాఖలో కలకలం రేపిన ఈ విషాదకర ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో సోమవారం జరిగింది. వివరాలివి..

పాస్టర్ ఎం.కిరణ్ కుమార్ పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) చర్చిని 13 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పాసా ట్రస్ట్ పేరిట ఎలాంటి అనుమతుల్లేకుండా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లి, కొయ్యూరు తదితర మండలాలకు చెందిన 86 మంది పిల్లలు ఇక్కడ ఆశ్రయం పొందుతూ, సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం పందూరు గ్రామంలో లోవరాజు అనే వ్యక్తి ఇంట్లో ఓ కార్యక్రమం జరిగింది. అక్కడ మిగిలిపోయిన వెజ్ బిర్యానీని రాత్రి ఆశ్రమ పిల్లలకు పెట్టారు. దాంతో పాటు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఇచ్చిన సమోసాలను కూడా విద్యార్థులకు అందించారు. వీటిని తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి (తెల్లవారితే ఆదివారం) 2 గంటల ప్రాంతంలో ఐదుగురు పిల్లలకు వాంతులు, విరేచనాలయ్యాయి. మళ్లీ వేకువజాము 4 గంటల సమయంలో మరో 21 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. వారికి స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇళ్లకు పంపించేశారు. ఇళ్లకు వెళ్లినవారిలో కొందరి పరిస్థితి విషమించడంతో పాడేరు, చింతపల్లి, కొయ్యూరు, నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. కొయ్యూరు మండలం డౌనూరు ఆస్పత్రిలో 18 మందిని చేర్చగా, అందులో పరిస్థితి సీరియస్‌గా ఉన్న నలుగురిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డౌనూరు ఆస్పత్రిని ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించి అనారోగ్యానికి గురైన బాలికలతో మాట్లాడారు. నేరుగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 15 మంది చేరగా వారిలో ఆరుగురి పరిస్థితి విషమించడంతో వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌కు మొత్తం 14 మందిని తీసుకొచ్చి, చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనలో కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ రెల్లలపాలేనికి గెమ్మెలి నిత్య(భవాని)(8), చింతపల్లి మండలం తిరుమల పంచాయతీ నిమ్మలపాలేనికి చెందిన తంబెలి జాషువా(7), చింతపల్లి మండలం బలభద్రకు చెందిన కొర్రా శ్రద్ధ(7) మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అనకాపల్లి జేసీ జాహ్నవి సంఘటనా స్థలానికి చేరుకు విచారణ జరిపారు. ఆశ్రమాన్ని ఎన్నేళ్లుగా నడుపుతున్నారు? అనుమతులపై ఎంఈవో రామారావును ప్రశ్నించారు. అనుమతి లేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఇలా అనుమతి లేకుండా ఎన్ని ఆశ్రమాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఇదొకటే అని చెప్పడంతో కచ్చితంగా చెప్పగలరా అంటూ ఆగ్రహించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. నక్కపల్లి సర్కిల్ సీఐ అప్పన్న విచారణ చేపట్టి నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్డీవో వి.జయరాం, ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సంఘటనా స్థలంలో విచారణ జరిపి, వివరాలు సేకరించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఉన్నత స్థాయి కమిటీ విచారణకు సీఎం ఆదేశించినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు.



నర్సీపట్నం ఆస్పత్రిలో చిన్నారులను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక



నర్సీపట్నం ఆస్పత్రి నుంచి విశాఖ కేజీహెచ్‌కు బాలలను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

14 మందికి కేజీహెచ్‌లో చికిత్స

అస్వస్థతకు గురైన 14 మంది పిల్లలను పలు అంబులెన్స్‌లలో కేజీహెచ్ పిల్లల వార్డుకు తీసుకొచ్చారు. వీరికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది వైద్య సేవలు అందించారు. వీరిలో పి.జెస్సికా బీపీ డౌన్ అవుతోందని, ప్రస్తుతానికి ఆక్సిజన్ పెట్టినట్లు వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన పిల్లలకు కేజీహెచ్‌లో అందుతున్న సేవలను విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ దగ్గరుండి పర్యవేక్షించారు. పిల్లలతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందుతుందని భరోసానిచ్చారు. కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను రాష్ట్ర హోం మంత్రి వి.అనిత, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకుడు పి.ఎల్.ఎన్.మాధవ్ పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌కు రిమాండ్

సాక్షి, అనకాపల్లి: పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని జిల్లా ఎస్పీ దీపికా పాటిల్ సోమవారం రాత్రి మీడియాకు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఇందులో ఇంకెవరున్నా వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. తమ విచారణలో డొనేషన్ ఇచ్చిన బిర్యానీ ఫుడ్‌ను రాత్రి డిన్నర్‌లో పెట్టడం.. ఫుడ్ పాయిజన్ అయి వాంతులు, విరేచనాలతో గురైన వెంటనే ఆస్పత్రికి పంపించకుండా నిర్వాహకుడు వారి తల్లిదండ్రులకు అప్పగించడం మృత్యువాతకు దారి తీసినట్టు తేలిందన్నారు. అంతేకాకుండా ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా అనధికారికంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి హాస్టల్‌గా నడుపుతున్నట్లు తేలిందన్నారు. కిరణ్‌కుమార్‌పై పాత సెక్షన్ 304, కొత్త సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఇలా ఏజెన్సీ ప్రాంతం నుంచి విద్యార్థులను తీసుకొచ్చి అనధికారింగా ట్రస్టుల పేరిట హాస్టళ్లు ఏర్పాటు చేస్తే అలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..

విషాహారం తిని అస్వస్థతకు గురైన చింతపల్లి మండలానికి చెందిన పిల్లల్ని వారి తల్లిదండ్రులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. కిటుముల పంచాయతీ సర్పంచ్ గెమ్మిలి రమణమ్మ విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలిచారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి, వైద్యులు వికాస్, లత, రాజు, సువర్ణ సత్వర వైద్య సేవలు అందించి, మెరుగైన చికిత్సకు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆర్డీవో జయరాం ఆస్పత్రిలోనే ఉండి వైద్య సేవల్ని పర్యవేక్షించారు.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న జేసీ జాహ్నవి

రక్త కన్నీరు

కొయ్యూరు/చింతపల్లి: విషాహారం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు చిన్నారుల తల్లిదండ్రులు అంతులేని శోకంతో తల్లడిల్లిపోయారు. వారి కంట కన్నీరు ఏరులై పారింది. గెమ్మెలి నిత్య మృతితో ఆమె స్వగ్రామం రెల్లలపాలెంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన గెమ్మెల సత్యారావు, గెమ్మెల కుమారికి ముగ్గురు సంతానం. వీరిలో నిత్య.. క్రైస్తవ మిషనరీలో చదువుకుంటోంది. ఆమెకు బాగోలేదని శనివారం రాత్రి తమకు ఫోన్ రావడంతో వెంటనే అక్కడికి వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి తీసుకువచ్చామని వారు తెలిపారు. ఉన్నట్టుండి నిత్యకు వాంతులు, విరోచనాలు కావడంతో ఆరోగ్యం విషమించిన కాసేపటికి మృతి చెందిందని తెలిపారు. 'కూతురు బాగా చదువుకుని ఉద్యోగం చేసుకుంటాదని అక్కడికి పంపించామని..అందనిలోకాలకు వెళ్లిపోయి తమకు గర్భశోకం మిగిల్చిందని వారు రోదించారు.

విషాదఛాయలు

చింతపల్లి మండలానికి చెందిన కిటిమల పంచాయతీ నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలు జుషువా (6), బలభద్రం గ్రామానికి చెందిన కొర్రా శ్రద్ధ (6) అనారోగ్యానికి గురయ్యారని క్రైస్తవ మిషనరీ సంస్థ నుంచి ఫోన్ రావడంతో కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం బయలుదేరి వెళ్లి తీసుకువచ్చారు. ఇంటికి తీసుకువచ్చిన తరువాత ఆదివారం రాత్రి ఇరువురు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తంబెలి నర్సింగ్, చిలకమ్మ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు జాషువా. చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్న ఆశతో అక్కడి పంపించామని, ఇలా జరుగుతుందని ఊహించలేదని తల్లిదండ్రులు నర్సింగ్, చిలకమ్మ రోదించారు. బలభద్రం గ్రామానికి చెందిన కొర్రా అప్పారావు, ముత్తా దంపతులకు ఐదుగురు సంతానం. పెద్ద కుమార్తె సామిని, రెండో కుమార్తె శ్రద్ధ కైలాసపట్నంలోని క్రైస్తవ మిషనరీలో చదువుతున్నారు. కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురికావడంతో ఇద్దరిని తల్లిదండ్రులు ఆదివారం ఇంటికి తీసుకువచ్చారు. శ్రద్ధ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందింది. జాషువా, శ్రద్ధ మృతదేహాలను స్థానిక ఏరియా ఆస్పత్రికి సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న శ్రద్ధ తల్లిదండ్రులు

కడుపు నొప్పి అన్నప్పుడే.. అప్రమత్తమైతే..!

- ఆ ముగ్గురూ మృత్యువాత పడేవారే కాదు
- ఫుడ్ పాయిజనై 24 గంటల సేపు ఆస్పత్రి ఊసే లేదు.
- సంఘటన నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన నిర్వాహకుడు
- బిర్యాని తిన్న అర్ధరాత్రి ఐదుగురు చిన్నారులకు అస్వస్థత
- మరుసటి రోజు మరో 20 మందికి వాంతులు, విరేచనాలు
- ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఇంటికెళ్లేసరికే పరిస్థితి విషమం



పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన సంస్థ నిర్వహిస్తున్న ఆశ్రమం (ఇన్‌సెట్‌లో) నిర్వాహకుడు కిరణ్‌కుమార్

సాక్షి, అనకాపల్లి/కోటవురట్ల: పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన(పాసా) ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్ నిర్లక్ష్యం, తప్పించుకునే ధోరణే విద్యార్థుల మృతికి కారణమైంది. శనివారం ఫంక్షన్‌లో మిగిలిన బిర్యానీని పిల్లలు తిన్నాక, ఆదేరోజు అర్ధరాత్రి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అప్పుడే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించి ఉంటే ఆ చిన్నారుల ప్రాణాలు నిలిచేవి. మొట్టమొదట అస్వస్థతకు గురైన ఐదుగురిలో ముగ్గురు మృత్యువాత పడగా, మరో విద్యార్థి జెస్సికా విషమ పరిస్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది.

నిర్లక్ష్యమే బలి తీసుకుంది

ఫుడ్ పాయిజన్ లక్షణాలతో 24 గంటలపాటు ఆ చిన్నారులు మృత్యువుతో పోరాడారు. సకాలంలో వారికి వైద్యం అంది ఉంటే ప్రాణాపాయం తప్పేది. రెండోసారి మరి కొందరు అస్వస్థతకు గురైనప్పుడైనా స్పందించలేదు. అస్వస్థతకు గురైన పిల్లలంతా ఒకే చోట లేకుండా తల్లిదండ్రుల్ని పిలిచి, వారికి అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు కేవలం తమ బిడ్డకే ఇలా జరిగిందనుకుని, ఇంటికి తీసుకెళ్లారు. నిర్వాహకుడు తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేసే ప్రయత్నమే ఇంత మంది పిల్లల్ని ఇబ్బందిలో పెట్టింది. పాసా ట్రస్ట్ పేరిట 13 ఏళ్లుగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా దీన్ని నడుపుతున్నా ఏనాడూ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పోలీసులు దృష్టిసారించలేదు. ఇక్కడ మూడేళ్ల పిల్లలు కూడా ఉన్నారు.

86 మంది పిల్లలు.. ఒకటే గది!

ఒక రేకుల షెడ్ నిర్మించి, అందులోనే చింతపల్లి, పాడేరు, కొయ్యూరు మండలాలకు చెందిన 86 మంది పిల్లలకు వసతి కల్పించారు. వీరిలో 40 మంది బాలికలున్నారు. 10 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికలు ఐదుగురున్నారు. బాలికలకు మూడు మరుగుదొడ్లున్నా, రాత్రుళ్లు అందరూ ఒకేచోట పడుకోవాల్సిందే. పాస్టర్ కిరణ్‌కుమార్ గతంలో కోటవురట్ల మండలం గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో చర్చి ఏర్పాటు చేశారు. ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో గిరిజనులు తరిమేశారు. అక్కడి నుంచి కైలాసపట్నం వచ్చి పాసా ట్రస్టును నెలకొల్పాడు. కట్టుబట్టలతో వచ్చిన పాస్టర్ కొద్ది కాలంలోనే విలాసవంతమైన జీవితానికి మారినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, చవ్వాకుల చిన్న తీవ్రంగా ఖండించారు. నిర్వాహకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అనధికారిక ఆశ్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నివేదిక అందించండి

అనకాపల్లి: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆశ్రమానికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా, దీనికి గల కారణాలపై నివేదిక అందించాలన్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

దురదృష్టకర సంఘటన

నర్సీపట్నం: విషాహారంతో చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం, అస్వస్థతకు లోను కావడం అత్యంత దురదృష్టకరమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఏరియా ఆస్పత్రిలో అస్వస్థతకు గురైన విద్యార్థులను ఎస్పీ దీపికతో కలిసి పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ హాస్టల్ నడిపే వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని, శాంపిల్స్ సేకరించి నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు.

తాండవ నీరు విడుదల

రైతులు పొదుపుగా వాడుకోవాలి: డీఈ అనురాధ

నాతవరం: తాండవ రిజర్వాయరు నీటిని రైతులంతా పొదుపుగా వాడుకోవాలని ప్రాజెక్టు డీఈ అనురాధ కోరారు. ఇక్కడ వినాయకుని,నల్లకొండమ్మ తల్లి ఆలయాల్లో సంప్రదాయం ప్రకారం సోమవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాండవ ప్రాజెక్టులో జలహారతి ఇచ్చి గేట్లు వద్ద పూజలు చేసి ఉదయం 9.45 గంటలకు ప్రధాన గేట్లు ఎత్తి సాగునీటిని కాలువల ద్వారా ఆయకట్టుకు విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్టు డీఈ మాట్లాడుతూ కుడి కాలువ ద్వారా 100, ఎడమ కాలువ ద్వారా 200, తాండవ నదిలోకి 35 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేశామన్నారు. 80 రోజులు సాగునీరు ప్రవహిస్తుందన్నారు. తొలి రోజు తక్కువ నీటిని విడుదల చేశామన్నారు. కాలువలో పూడిక తీసి మరింత నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టులో సోమవారానికి 376.7 అడుగులు నీటి మట్టం ఉందన్నారు. వర్షం పడితేనే ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. రెండు జిల్లాల పరిధిలో తాండవ కాలువపై తమ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని, ఎక్కడైనా నీరు వృథా అయితే ఆయకట్టుదారులు సమాచారం ఇవ్వాలన్నారు. తాండవ ప్రాజెక్టు జేఈలు రామకృష్ణ, శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్ పాత్రుడు, నాగబాబు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, నర్సీపట్నం జెడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, నాతవరం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేముడు, నేతల విజయకుమార్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, అప్పన విజయ్, రైతులు పాల్గొన్నారు.



తాండవ ప్రాజెక్టుపై వేదపండితులతో పూజలు చేయిస్తున్న ప్రాజెక్టు డీఈ అనురాధ



ప్రాజెక్టు ప్రధాన గేట్ల నుంచి కాలువలోకి వస్తున్న నీరు

జిల్లా ఆస్పత్రులకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లు

తుమ్మపాల: జిల్లా ఆస్పత్రులు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికెట్లను సాధించడం అభినందనీయమని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై ఆమె ప్రశంసలు కురిపించారు. ఆరోగ్యపరమైన సేవలు అందించడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎప్పటిలాగే ముందుండాలన్నారు. జిల్లా ఆస్పత్రికి -3, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు-16, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు-2, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు-7 సర్టిఫికెట్లను ఆమె ప్రదానం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి శ్రీనివాసరావు, ఇతర వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

వినూత్నంగా వృక్షా బంధన్

రోలుగుంట: కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రక్షా బంధన్ వేడుకలు వినూత్నంగా నిర్వహించారు. సోషల్ టీచర్ అప్పన రాంబాబు ఆధ్వర్యంలో మర్రి చెట్టుకు రాఖీ కట్టి వృక్షాలపై తమకున్న ప్రేమను చాటుకున్నారు. చెట్టు లేకపోతే మనుషులు లేరని, ఆక్సిజన్ అందించే వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అందువల్లే వృక్షాలకు రాఖీ కట్టి వాటిని మన కుటుంబంలో భాగస్వామ్యం చేసుకోవడం శుభ పరిణామమని ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.విద్యావతి అన్నారు.



పాఠశాల ఆవరణలో మర్రి చెట్టుకు రాఖీ కట్టి వినూత్నంగా వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో 25 అర్జీల స్వీకరణ



వృద్ధురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న దిశ డీఎస్పీ ఉపేంద్రబాబు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో 25 అర్జీలు స్వీకరించారు. దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటూ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర వాటిపై అర్జీలు వచ్చాయని, చట్టపరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ రికవరీ మేళాలో 284 ఫోన్ల అందజేత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న డీఎస్పీలు అప్పారావు, ఉపేంద్రబాబు

తుమ్మపాల: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'మొబైల్ రికవరీ మేళా' నిర్వహించి, ఫోన్లు పోగొట్టుకున్న 284మందికి సోమవారం మొబైల్ ఫోన్లను అందజేశారు. వీటి మొత్తం విలువ రూ.32 లక్షలు ఉంటుందని డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.ఉపేంద్రబాబు చెప్పారు. ఇప్పటికి మొత్తం 3,300 ఫిర్యాదులు రాగా రూ.2.77 కోట్ల విలువ చేసే 1,930 ఫోన్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణరావు, అప్పలనాయుడు, ఐటీ కోర్ ఎస్‌ఐ రఘువర్మ, ఐటీ కోర్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు

తుమ్మపాల: ప్రజల నుంచి అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని, సంతృప్తికర స్థాయిలో సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామామణి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు అర్జీదారులతో మాట్లాడి, సమస్యను తెలుసుకుని పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చూపాలని తెలిపారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 143 వినతులు అందాయని డీఆర్వో తెలిపారు. వాటిలో రెవెన్యూ శాఖ సంబంధించినవి 24 ఉండగా, పోలీసు శాఖకు చెందినవి ఐదు, పంచాయతీ రాజ్ శాఖకు చెందినవి ఐదు, నక్కపల్లి మండల రెవెన్యూ అధికారి కార్యాలయానికి సంబంధించి 10, పరవాడ మండల రెవెన్యూ అధికారి కార్యాలయానికి సంబంధించి ఆరు అర్జీలున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులు

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో చేర్చాలి

డీఎల్‌పురంలో ఇంటితో పాటు 10 సెంట్ల స్థలాన్ని వీసీఐసీ ల్యాండ్ అక్విజేషన్‌లో పోగొట్టుకున్నప్పటికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో తన పేరును చేర్చలేదని ఆ గ్రామానికి చెందిన ఇసరపు శ్రీను అనే వ్యక్తి కలెక్టర్‌కు అర్జీ అందజేశాడు. ఇల్లు, స్థలానికి నష్టపరిహారం కూడా పొందానని పేర్కొన్నాడు. ఏపీఐఐసీ ఇటీవల విడుదల చేసిన జాబితాలో తన పేరులేదని, తనకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరాడు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరాడు.

మెడికల్ మాఫియా నుంచి రోగులను రక్షించాలి

ఎన్టీఆర్ ఆస్పత్రిలో సిటీ స్కాన్ అందుబాటులోకి తెచ్చి, నాణ్యమైన సేవలు అందించి, మెడికల్ మాఫియా, ప్రైవేట్ అంబులెన్స్ మాఫియా నుంచి రోగులను రక్షించాలని సీపీఐ నాయకులు వై.ఎన్.భద్రం, టి.వెంకటేశ్వరరావు, కొరిబిల్లి శంకరరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రోగుల తాకిడికి తగ్గట్టుగా ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్య సిబ్బందిని, నర్సింగ్ స్టాఫ్‌ను, క్లాస్ ఫోర్ సిబ్బందిని ఏర్పాటుచేయాలని, నిపుణులైన ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, న్యూరో సర్జన్లను నియమించాలని కోరారు. గైనిక్ విభాగంలో అవినీతిని అరికట్టాలని, పారిశుద్ధ్య సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

రైతులకు న్యాయం చేయాలి

ఏపీఐఐసీ ద్వారా వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డీఎల్ పురం రెవెన్యూ గ్రామాల్లో 5,500 ఎకరాలను రైతుల నుంచి సేకరించారని, వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఆయా గ్రామస్తులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. భూములు కోల్పోయిన రైతులను, నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి నేతల ఘర్షణ

- జనసేన మద్దతు అభ్యర్థి గెలుపుతో రగిలిపోయిన టీడీపీ సూపర్ సర్పంచ్
- దౌర్జన్యంగా ఎన్నికల రికార్డు పుస్తకాన్ని తీసుకు వెళ్లిన వైనం

అనకాపల్లి: జనసేన, టీడీపీలో కుమ్ములాటలు గ్రామీణ స్థాయి నుంచి మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారిగా జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో జనసేన, టీడీపీ నాయకులు కుమ్ములాటకు సిద్ధమయ్యారు. ఈనెల 17వ తేదీన అనకాపల్లి మండలం దిబ్బపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో హైస్కూల్ ఛైర్మన్‌గా జనసేన నుంచి కరణం అరుణ, టీడీపీ నుంచి మళ్ల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నుంచి నందారపు శ్రీనివాసరావులు తొలుత పోటీకి దిగారు. శ్రీనివాసరావు పోటీ నుంచి తప్పుకోవడంతో జనసేన, టీడీపీల మధ్య పోటీ రసవత్తరంగా జరిగింది. ఇద్దరికీ సమానంగా 8 ఓట్లు వచ్చాయి. నందారపు శ్రీనివాసరావు జనసేన నుంచి పోటీ చేస్తున్న కరణం అరుణకు మద్దతు ఇవ్వడంతో అరుణ తొమ్మిది ఓట్లతో ఎస్ఎంసీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను నిలుపుదల చేయాలని టీడీపీకి చెందిన గ్రామ సూపర్ సర్పంచ్ అప్పారావు హెచ్‌ఎంపై తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగిన ఎన్నికలను ఆపడం సాధ్యపడదని హెచ్‌ఎం చెప్పారు. దీంతో సూపర్ సర్పంచ్ సోమవారం హైస్కూల్‌కు 15మంది సభ్యులను వెంటపెట్టుకుని ఎన్నికల రికార్డు పుస్తకాన్ని దౌర్జన్యంగా తీసుకుని వెళ్లిపోయారు. ఆ రికార్డు పుస్తకాన్ని సూపర్ సర్పంచ్ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వద్దకు తీసుకొచ్చారు. ఆయన సమక్షంలోనే ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని స్కూల్ నుంచి తీసుకువచ్చిన ఎస్ఎంసీ ఎన్నికల రికార్డుబుక్‌ను తక్షణమే హెచ్‌ఎంకు అప్పగించాలని చెప్పడంతో సూపర్‌సర్పంచ్ రికార్డులను హెచ్‌కు మధ్యాహ్నం 1 గంటకు అప్పగించారు.

స్కూల్ హెచ్‌ఎం ఫిర్యాదు

ఎస్ఎంసీ ఎన్నికల రికార్డు పుస్తకాన్ని స్కూల్ నుంచి తీసుకుని వెళ్లిన సూపర్ సర్పంచ్‌పై హెచ్‌ఎం గ్రామ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శికి (మహిళా పోలీస్), ఎంఈవో కోటేశ్వరరావు, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మలకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఉదయం 11 గంటలకు తీసుకుని వెళ్లిపోయిన ఎస్ఎంసీ పుస్తకాన్ని మధ్యాహ్నం 1 గంటలకు సూపర్ సర్పంచ్ హెచ్‌ఎంకు అందజేశారు.

భవిత కేంద్రాలకు రాలేని వారికి హోమ్ బేస్డ్ విద్య

రాష్ట్ర సహిత విద్య విభాగ అబ్జర్వర్ అమ్మినాయుడు

కె.కోటపాడు: తీవ్రమైన అంగవైకల్యంతో బాధపడుతూ భవిత కేంద్రాలకు రాలేని పిల్లలకు వారి ఇంటి వద్దే హోమ్ బేస్డ్ విద్య అందించాలని రాష్ట్ర సహిత విద్య విభాగ అబ్జర్వర్ ఎస్.అమ్మినాయుడు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ద్వారా చదువుతున్న 192 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు చదువులతో పాటు వారి మానసిక, ఆరోగ్య పరిస్థితులను సహిత విద్య ఉపాధ్యాయులు సీహెచ్.కన్నమ్మ, పరదేశిలను అడిగి తెలుసుకున్నారు. 6-18 ఏళ్ల మధ్య వయస్సు గల దివ్యాంగ విద్యార్థులతో పాటు తీవ్ర, అతి తీవ్ర దివ్యాంగత్వంతో ఉన్న విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని ఆయన సూచించారు. కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న తీవ్ర, అతి తీవ్ర దివ్యాంగత్వంతో పాటు మానసిక పరిస్థితి బాగాలేని విద్యార్థుల ఇళ్ల వద్దకు సహిత విద్య ఉపాధ్యాయులు వెళ్లి ప్రతి శనివారం హోమ్ బేస్డ్ విద్యను అందించాలని ఆయన సూచించారు. భవిత కేంద్రాల్లో చదువుతున్న, అందుబాటులో ఉన్న పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ శకుంతల, మండల విద్యాశాఖాధికారి డి.వి.డి.ప్రసాద్, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.



కె.కోటపాడు భవిత కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అమ్మినాయుడు

పెందుర్తిలో దొంగల హల్‌చల్



పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో చోరీకి గురైన ఇల్లు



దుండగులు విరగ్గొట్టిన ఇంటి ప్రధాన ద్వారం

- ఏకకాలంలో మూడిళ్లలో దోపిడీ
- 17 తులాల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి అపహరణ

పెందుర్తి: పెందుర్తిలో వరుసగా రెండో రోజు దొంగలు అలజడి రేపారు. స్థానిక రైల్వే స్టేషన్ మార్గంలోని జనచైతన్య లేఅవుట్ గణేష్‌నగర్‌లో ఏకకాలంలో మూడిళ్లను కొల్లగొట్టారు. ఆయా ఇళ్లల్లోని 17 తులాల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి సామగ్రి, రూ.19 వేలు అపహరించుకుపోయారు. వెళుతూవెళుతూ కాలనీలో పార్కు చేసిన రెండు బైక్‌లను కూడా తస్కరించారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం..గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న పి.శ్రీనివాసరావు (బ్యాంక్ మేనేజర్) కుటుంబంతో కలిసి ఆదివారం సాయంత్రం నగరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి గమనించగా బీరువా తెరిచి ఉంది. అందులోని 16 తులాల బంగారు ఆభరణాలు, 70 తులాల వెండి సామగ్రి పోయినట్లు గుర్తించారు. ఇదే కాలనీలో నివాసం ఉంటున్న కాసా శ్రీనివాసరావు కుటుంబంతో రెండు రోజుల క్రితం బయటకు వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంట్లోని తులం బంగారం, 750 గ్రాముల వెండి సామగ్రి, రూ.10 వేలు మాయం అయినట్లు గుర్తించారు. ఇదే కాలనీలో మరోచోట ఉంటున్న ఎం.గణేష్ ఆదివారం రాత్రి బయటకు వెళ్లి సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలోని రూ.9 వేలు దొంగతనం చేసినట్టు గుర్తించారు. ఇదే కాలనీలో పార్కింగ్ చేసి రెండు బైక్‌లను కూడా తీసుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు నేరస్థలాలను క్రైం ఏసీపీ శ్యామలరావు, సీఐ శ్రీనివాసరావు, ఇంచార్జి క్రైం ఎస్‌ఐ సుదర్శన్ సందర్శించి దొంగతనాలు జరిగిన తీరుపై ప్రాథమిక విచారణ చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి

అనకాపల్లి: మండలంలో శంకరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓవ్యాన్ డ్రైవర్ మృతిచెందాడు. రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు కథనం మేరకు వివరాలు...విజయనగరం నుంచి విజయనగరంజిల్లా పెదగ్యంటాడ గ్రామానికి చెందిన శిలపరశెట్టి గోపాల్(52) తన వ్యాన్‌లో ప్రయాణికులను రాజమండ్రి తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలో విజయనగరం బయలుదేరాడు. శంకరం బ్రిడ్జిపై వ్యాన్‌ను ఆపి ముఖం కడుగుతున్న సమయంలో అదే రహదారిలో వెళుతున్న లారీ.. గోపాల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగు పడి కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

మరో కార్మికుడికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారిలో పిడుగు పడి ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందగా.. మరో కార్మికుడికి గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. స్టీల్‌ప్లాంట్ టీపీపీ విభాగంలో కాంట్రాక్ట్ పనులు నిర్వహిస్తున్న సి.కె.ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గంగవరానికి చెందిన వాకాడ పెంటయ్య(35), ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజారామ్ పటేల్ కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నారు. సోమవారం విధులకు హాజరైన వీరిద్దరూ మొబైల్ సిమ్ మార్చుకునేందుకు బైక్‌పై కూర్మన్నపాలెం బయలుదేరారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ కాంప్లెక్స్ కూడలి సమీపంలోకి వచ్చేసరికి ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. దీంతో వారు బైక్ దిగి ఓ చెట్టు కింద తలదాచుకున్నారు. కొద్దిసేపటికి పిడుగు ఒక్కసారిగా వారు తలదాచుకున్న చెట్టుపై పడింది. అనంతరం పెంటయ్యపై పడగా అతను అక్కడికక్కడే కూలిపోయాడు. పక్కనే ఉన్న రాజారామ్ పటేల్ ఆ శబ్దానికి కింద పడ్డాడు. ఈ ఘటనలో పెంటయ్య అక్కడే మృతి చెందగా.. రాజారామ్ పటేల్ గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ తాతారావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పటేల్‌ను చికిత్స నిమిత్తం ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. పెంటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలం వద్ద పెంటయ్య మృతదేహం

ఏయూలో రంధ్రాన్వేషణ

- రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై విచారణకు శ్రీకారం
- గత నిర్ణయాలు, కాంట్రాక్టులు, నిధుల వినియోగంపై రికార్డుల పరిశీలన
- ఇందుకోసం విభాగాల వారీగా ఆరు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- సభ్యులుగా ఏయూతో పాటు ఇతర వర్సిటీ ప్రొఫెసర్ల నియామకం



విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రంధ్రాన్వేషణకు అధికారులు శ్రీకారం చుట్టారు. రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై విచారణకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పెద్దల రహస్య ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏయూలో ఎన్నడూ లేని విధంగా గత పాలనలో టీడీపీ నేతలు ఆరోపణలను భూతద్దంలో చూపించే కొత్త రాజకీయాలకు తెరతీశారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ, కాంట్రాక్టుల మంజూరు, నిధుల దుర్వినియోగం వంటి వాటిపై విచారణకు ఏయూ వైస్ ఛాన్సులర్ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు ఆరు కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీలో ఏయూ ఆచార్యులతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు, నిపుణులను నియమించారు. ఏయూలో పలు విభాగాల్లో గతంలో తీసుకున్న నిర్ణయాలు, ఆమోదం, అమలుపై వచ్చిన ఆరోపణలపై నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

2019 నుంచి 2024 మధ్య విస్తృత అభివృద్ధి

2019–24 మధ్య ఏయూ విశేష ప్రగతి సాధించిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ప్రధానంగా నాణ్యమైన విద్యతో పాటు పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఆ-హబ్ సెంటర్, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఫుడ్ టెస్టింగ్, ఫార్మా ఇంకుబేషన్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల ఉపయుక్తంగా ఉండేలా అల్గారిథం పేరుతో భవనం, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, అంబేడ్కర్ చైర్, మేథో హక్కుల పరిరక్షణ కోసం పనిచేసేలా ఏపీకే నోడల్ సెంటర్‌గా ఇంటలెక్చువల్ ప్రోపర్టీ రైట్స్(ఐపీఆర్) చైర్, ఓపెన్ ఎయిర్ థియేటర్, లైబ్రరీ ఆధునికీకరణ, తాళపత్రాల డిజిటలైజేషన్.. ఇలా అనేక నూతన అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. ఏయూ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో పేటెంట్ హక్కులు వచ్చాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేనవిధంగా విద్యార్థులకు అత్యధిక వేతనాలతో విపరీతంగా ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఏయూలో పరిశోధనాత్మక విద్యా బోధన, సౌకర్యాల కల్పనతో ప్రతిష్టాత్మక నాక్ ఏ++ గ్రేడ్ గుర్తింపు లభించింది.

ఆరు కమిటీల ఏర్పాటు

ఆరు విభాగాల్లో జరిగిన కార్యక్రమాలతో పాటు కాంట్రాక్టులు, ఇతర అంశాలపై విచారణకు ఆరు కమిటీలను నియమించారు.

- ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్(ఏయూ టీడీఆర్ హబ్)పై విచారణకు ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుతం ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య పి.మల్లికార్జునరావు, ప్రొఫెసర్లు వజీర్‌మహ్మద్, పి.సునీత, ఎం.గోపీచంద్ నాయక్, అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, విజయనగరం గురజాడ వర్సిటీ ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, డైరెక్టర్ కె.చంద్రభూషణ్‌లు సభ్యులుగా ఉన్నారు.
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌పై విచారణకు ప్రొఫెసర్లు కె.రాంజీ, పి.మల్లికార్జునరావు, జి.ఎం.జె.రాజు, బి.ప్రజ్ఞ, పి.శైలజలను నియమించారు.
- ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్)కు ఎ.నరసింహారావు, పి.సునీత, వజీర్‌మహ్మద్, బి.మునిస్వామి, పి.అనూరాధ కామేశ్వరిలను నియమించారు.
- రూసా ఫేజ్-2 వినియోగంపై పరిశీలనకు ప్రొఫెసర్లు ఆర్.పద్మశ్రీ, జి.గిరిజాశంకర్, కె.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ విజయనగరం డైరెక్టర్ కె.చంద్రభూషణ్‌రావు, ఏయూ ఎఫ్ఓ వి.సూర్యారావులను సభ్యులుగా నియమించారు.
- సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌పై విచారణకు ప్రొఫెసర్లు కె.రాంబాబు, వజీర్‌మహ్మద్, బి.మునిస్వామి, ఎం.ఎస్.అనూరాధ, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్.అనీల్‌కుమార్, జేఎన్‌టీయూ విజయనగరం డైరెక్టర్ కె.చంద్రభూషణరావును సభ్యులుగా నియమించారు.
- ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)పై విచారణకు ప్రొఫెసర్లు ఆర్.పద్మశ్రీ, వజీర్ మహ్మద్, డి.ఎ.నాయుడు, కె.ఈశ్వర్‌కుమార్, జి.నానాజీరావు, నాగార్జున వర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నుంచి డాక్టర్ టి.ఎ.వి.ప్రసాద్, జేఎన్‌టీయూ విజయనగరం డైరెక్టర్ కె.చంద్రభూషణ్‌రావును నియమించారు.

టీడీపీ ఆరోపణలపైనే..!

2019 నుంచి టీడీపీ నేతలు ఏయూపై బురద జల్లుతూనే వచ్చారు. ఒకవైపు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినప్పటికీ ఏయూ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు చేశారు. ప్రస్తుత ప్రజాప్రతినిధి అప్పట్లో ఏయూను దెయ్యాల కొంపగా అభివర్ణిస్తూ తూలనాడినప్పటికీ.. ప్రస్తుత కమిటీలో ఉన్న కొంత మంది ప్రొఫెసర్లు కనీసం నోరు మెదపలేదు. కానీ వారు చేసిన ఆరోపణలపై విచారణకు మాత్రం ముందు వరుసలోకి వచ్చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఏయూపై ఆరోపణలను మరింత పెంచారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఏయూ వీసీ ఛాంబర్‌పై తెలుగు తమ్ముళ్లు దండెత్తారు. వెంటనే అప్పటి ఏయూ వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏయూలో అక్రమాలు జరిగాయంటూ వాటన్నింటిపై విచారణ చేయిస్తామని టీడీపీ నేతలు అప్పుడే హెచ్చరించారు. దానికి తగ్గట్టుగానే ప్రస్తుత ఏయూ అధికారులు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల రహస్య ఆదేశాలతో గత పాలనలో జరిగిన కార్యక్రమాలపై విచారణకు సిద్ధమయ్యారు.

ఉధృతంగా తాచేరు



డైవర్షన్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరగకుండా కాపలా కాస్తున్న పోలీసులు

డైవర్షన్ రోడ్డు వద్ద పోలీస్ బందోబస్తు

బుచ్చెయ్యపేట: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తాచేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రవాహం కారణంగా తాచేరు డైవర్షన్ రోడ్డు దెబ్బతినే అవకాశం ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్థానిక ఎస్‌ఐ డి.ఈశ్వరరావు... పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోనాం రిజర్వేయర్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేసినా, వర్షం ఎక్కువై తాచేరునది ఉధృతంగా ప్రవహించినా డైవర్షన్ రోడ్డు మొత్తం కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. రోడ్డు దెబ్బతింటే రహదారి మూసివేయడానికి అధికార్లు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి

అనకాపల్లి: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్టు నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో విషాహారం తిని ముగ్గురు చిన్నారులు మరణించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోందని, కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు.

24 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడ్ని రైల్వేపోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలను తనిఖీలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నూరుద్దీన్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా హౌరాకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టులోహాజరుపరచగా రిమాండ్ విధించారు.

క్లుప్తంగా

ఎంపీడీవో రవికుమార్ బాధ్యతల స్వీకరణ

కశింకోట: స్థానిక ఎంపీడీవో కె.శేషుకుమార్ సోమవారం బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు బదిలీపై విజయనగరం జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. ఆ సమయంలో ఇక్కడ పనిచేసిన వీవీ రవికుమార్‌ను తూర్పుగోదారి జిల్లాకు బదిలీ చేశారు. తాజా బదిలీల్లో తూర్పుగోదావరి నుంచి రవికుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ప్రమాదకరంగా కల్వర్టు



రామాలయం వీధిలో కల్వర్టు దుస్థితి

పరవాడ: పి.బోనంగి గ్రామం రామాలయం వీధిలోని కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కల్వర్టు పై పలక విరిగిపోవడంతో రాత్రివేళల్లో చాలామంది కాలువలో పడిపోతున్నారు. వృద్ధులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టుపై పైమూత ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు అనేక సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధికాలువపై మూత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాడచీపురుపల్లి పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ అవార్డు



కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ కనకప్పారావు

పరవాడ: వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ నాణ్యత ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్) అవార్డు లభించింది. రెండేళ్ల క్రితం జాతీయ నాణ్యత ప్రమాణాల ప్రతినిధుల బృందం ఆస్పత్రిని సందర్శించి, సదుపాయాలను పరిశీలించి వెళ్లింది. ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో ఆస్పత్రికి అవార్డు లభించింది. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ఆస్పత్రి వైద్యాధికారి వి.కనకప్పారావు సోమవారం అవార్డును అందుకున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 171 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	5,150
రెండో రకం	3,700	4,550
మూడో రకం	3,230	3,350

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

విద్యుత్ షాక్‌కు.. పరిహారం పొందండిలా..

- విద్యుదాఘాతంతో మరణించే పశువులకూ పరిహారం
- ఎఫ్ఐఆర్, పోస్టుమార్టంతో దరఖాస్తు చేసుకోవాలి
- అవగాహన లేక నష్టపోతున్న పాడి రైతులు



విద్యుదాఘాతానికి గురై మరణించిన పాడి గేదె(ఫైల్)

అనకాపల్లి: వర్షాలు, తుపాన్ సమయంలో ప్రమాదవశాత్తూ పశువులు విద్యుదాఘాతానికి గురవుతుంటాయి. లక్షలు విలువ చేసే పాడి పశువులు అక్కడిక్కడే మృత్యువాత పడిన దాఖలాలెన్నో. వర్షాలు, ఈదురు గాలులు, తుపాన్ల సమయంలో విద్యుత్ తీగలు తెగి పడుతుంటాయి. వీటిని గమనించక కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, చాలా మంది క్షతగాత్రులవుతున్నారు. ఇలాంటి ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకుంటుంది. అయితే ఈ పరిహారంపై బాధితులకు అవగాహన లేకపోవడంతో చాలామంది నష్టపోతున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు : విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదయ్యాక పోస్ట్‌మార్టం నిర్వహించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్‌శాఖ సహాయక ఇంజనీర్(ఏఈ)కి దరఖాస్తు చేసుకోవాలి. డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఐఆర్, పోస్ట్‌మార్టం నివేదిక, ఆధార్, బ్యాంక్ అక్కౌంట్ తదితర కాపీలను జతచేసి విద్యుత్‌శాఖ ఏఈకి అందించాలి. ఏఈ ప్రాథమిక స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తారు. దరఖాస్తుతోపాటు, తన నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు పంపిస్తారు. ఆ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తర్వాత, మంజూరైన నష్ట పరిహారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

వ్యక్తులు మరణించినా, వైకల్యం పొందినా... పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు విద్యుత్ ప్రమాదం వల్ల మరణించినా, వైకల్యం పొందినా ప్రమాద విషయాన్ని వెంటనే విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. వైద్యం నిమిత్తం అయిన ఖర్చు బిల్లులు, ఇతర ఖర్చుల వివరాలు సంబంధిత ఆధారాలతో దరఖాస్తుకు జతపరచి విద్యుత్‌శాఖ ఏఈకి అందించాలి. ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి నష్టపరిహారం మంజూరు చేస్తారు.

పశువులు మృతి చెందితే... : పశువులు విద్యుత్ ఘాతానికి గురై మరణిస్తే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్వో, తహసీల్దార్‌లకు సమాచారం అందించాలి. పశు వైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు విలువ ఆధారంగా, నిబంధనలను అనుసరించి పరిహారం లెక్కిస్తారు. ఆ మేరకు బాధిత రైతుకు నష్ట పరిహారం దక్కుతుంది.

పోస్టుమార్టం తప్పనిసరి

విద్యుత్ షాక్‌తో పశువులు మరణిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో రైతు ఫిర్యాదు చేయాలి. పోలీసుల ఎఫ్ఐఆర్ మేరకు పశువైద్యాధికారితో పోస్టు మార్టం నిర్వహిస్తాం. ఆ నివేదికలో సంబంధిత పశువు మరణానికి విద్యుత్ షాక్ కారణమన్నట్లు తేలితే ఆ మేరకు నివేదిక అందిస్తాం. ఈ రెండింటిని తీసుకెళ్లి విద్యుత్ అధికారులకు అందించాలి. వారు దర్యాప్తు చేసి, పరిహారం అందిస్తారు.

– అనిల్‌కుమార్, పశువైద్యశాఖాధికారి, గవరపాలెం, అనకాపల్లి

అర్హులకు మాత్రమే పరిహారం

విపత్తుల సమయంలో పశువులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీస్ ఎఫ్ఐఆర్, వైద్యుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఈ రెండింటిని తీసుకుని రైతులు మాకు నివేదిస్తే దర్యాప్తు జరిపి, ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఉన్నతాధికారుల ఆమోదం మేరకు నష్ట పరిహారం బాధిత రైతులకు అందిస్తాం.

– శ్రీనివాసరావు, ఈపీడీసీఎల్ ఏఈ, అనకాపల్లి

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి ఆలయంలో నవకలశ స్నపనంలో భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం పట్టణ వీధుల్లో ఆలయ కమిటీ సభ్యులు ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామాచార్యుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన, గోపూజ ప్రదక్షిణలు, త్రిమాత(లక్ష్మి, సరస్వతి, కాళి)ల మూల మంత్ర హోమం, అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హయగ్రీవ జయంతి సందర్భంగా ఆలయంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాంబరేశ్వరుని కల్యాణం



కామాక్షి ఏకాంబరేశ్వరుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తున్న దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కామాక్షి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం కామాక్షి ఏకాంబరేశ్వరుల కల్యాణాన్ని వ్యాపారవేత్త పెదపాటి రమణారావు-మణి, వెంకటపార్వతీశం-సత్యసావిత్రి, గిరీష్‌కుమార్-విజయ్ కుమారి దంపతులు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారావు మాట్లాడుతూ ఏటా పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహించి, మధ్యాహ్నం అన్నసమారాధన జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజు రాజా, కోశాధికారి పొన్నాడ వెంకట నర్సింహాచారి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఓ అన్నా.. నీ అనురాగం



సచివాలయ పురుష సిబ్బందికి రాఖీలు కడుతున్న మహిళా సిబ్బంది



స్థానిక వేల్పులవీధిలో తమ్ముడికి రాఖీ కడుతున్న దృశ్యం

- ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
- సచివాలయంలో రక్షా బంధనం

అనకాపల్లి/కశింకోట: రాఖీ పౌర్ణమి పండగను పట్టణ, మండల పరిధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కచెల్లెల్లు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి, రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష అంటూ తమ బంధాన్ని చాటిచెప్పారు. అనంతరం మిఠాయిలు తినిపించి, అన్నల వద్ద ఆశీస్సులు పొందారు. తమ్ముళ్లకు ఆశీస్సులు అందించారు.

సచివాలయంలో రాఖీ వేడుకలు

పట్టణంలోని 7, 8 సచివాలయాల సిబ్బంది 7వ సచివాలయంలో రక్షా బంధన్ వేడుకలు చేసుకున్నారు. సచివాలయ మహిళా సిబ్బంది, పురుష సిబ్బందికి రాఖీలు కట్టారు. విధి నిర్వహణలో తమకు అండగా ఉంటూ, సోదర ప్రేమను అందిస్తున్న వారి ఆశీస్సులు పొందారు. రోజులో చాలా సమయం గడిపే కార్యాలయంలో తమ సాధకబాధకాలు చూసే వారి కంటే సోదరులు మరెవరుంటారని మహిళా ఉద్యోగులు ఆనందంగా చెప్పారు. కశింకోట మండల గ్రామాల్లో ప్రజలు రాఖీ పండగను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉన్న అక్కచెల్లెళ్లు గ్రామాలకు చేరి, తమ సోదరులకు రాఖీ కట్టారు. కొంత మంది అన్నదమ్ములు తామే సోదరి ఇంటికి వెళ్లి రాఖీ కట్టించుకున్నారు. తమ ఆత్మీయతలను పంచుకున్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ



అడ్డురోడ్డులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: కోల్‌కతా ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జరిగిన హత్య, అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ చేసి, నిందుతులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ డిమాండ్ చేశారు. అడ్డురోడ్డు కూడలిలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు మమతా బేగం, శ్రావణి ,రాజేశ్వరి,కేశవ, శ్రీను, కృపానంద్, సీహెచ్ లక్ష్మణ్, సీహెచ్ రాము తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో చేపట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన కుంది సూర్యనారాయణ-సూరిలక్ష్మి దంపతులు రూ.30వేల నగదు విరాళంగా అందజేశారు. దిమిలి పెంటారావు రూ.5వేలు, కుంది గోవింద, దిమిలి మురళి తదితరులు కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, ఆడారి లక్ష్మణరావు,మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'చవితి ఉత్సవాలకు సహకరించండి'



వినాయక చవితి ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం అందిస్తున్న కుమారస్వామి

తుమ్మపాల: వచ్చే నెల 7న జరిగే వినాయక చవితి నవరాత్రుల నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగేలా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి కోరారు. జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ త్వరలో జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. తక్షణమే వినాయక ఘాట్ మరమ్మతులు పూర్తిచేయాలని కోరారు. 60 వేల మట్టి ప్రతిమలు పట్టణ పరిసర ప్రాంతంలో వివిధ స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలతో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అధికారులు పూర్తిగా సహకరిస్తే ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహిస్తామని, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంపై ఆనందం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కమిటీ నేతలు పీలా గొల్లబాబు, మల్ల సురేంద్ర, కామేష్, దాడి బుజ్జి, పి.సోమశేఖర్, పట్నాయక్, బొట్టా చిన్ని, కరణం శ్రీను, గంటి రవి, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చక్రవర్తి

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. సబ్బవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎన్.చక్రవర్తి సోమవారం పాఠశాలను సందర్శించి, ఈ పరీక్షలు నిర్వహించారు. దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండే చోట దోమలు పెరుగుతాయని, అందువల్ల నీటి నిల్వలు లేకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కన్నంనాయుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత, ఎంపీహెచ్‌ఈవో జేసుదాసు, పీహెచ్ఎన్ రత్నాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ రాంబాబు, ఏఎన్ఎం అనురాధ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి'



లక్ష్మీదేవిపేట రైల్వే ఫ్లై ఓవర్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల: పట్టణంలో అర్ధంతరంగా నిలిచిపోయిన లక్ష్మీదేవిపేట రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్ని వెంటనే ప్రారంభించి, పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం బృందం ఫ్లై ఓవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చోడవరం, మాడుగుల నియోజవర్గాలతో పాటు పాడేరు జిల్లాకి చెందిన ప్రజలు ఈ రహదారి గుండానే పట్టణంలోకి సులభంగా రాగలరన్నారు. అనేక సందర్భాల్లో గుండాల వద్ద అండర్ బ్రిడ్జి నీటిలో మునిగిపోవడంతో ప్రజలు రహదారి సౌకర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టి సారించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రాజు, మండల కమిటీ సభ్యులు కాళ్ళ తేలయ్య బాబు, బొప్పే ఉమామేశ్వరరావు, కె.ఈశ్వరరావు, బి.నూక అప్పారావు పాల్గొన్నారు.

భారత్ బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్ కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బంద్ విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, ఐ.ఎస్. మూర్తి, పల్లా ప్రసాద్, ముక్కుడుపల్లి దాసు, నెలపర్తి నాగరాజు, గారాచంటి, పి.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

26న అప్రెంటిస్‌షిప్ కోసం ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం: ఏషియన్ పెయింట్స్‌లో అప్రెంటిస్‌షిప్ కోసం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఐటీలో ఫిట్టర్,ఎలక్ట్రికల్,మెకానికల్,డిప్లమోలో మెకానికల్, ఎలక్ట్రికల్,కెమికల్ కోర్సులను 2022-24లో పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని యాజమాన్యం తెలిపింది. పూర్తి వివరాలకు 9959590601 అనే ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొంది.

ఘనంగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో 2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి పెద్ద బాలవనం (యూకేజీ) విద్యార్థుల స్నాతకోత్సవాన్ని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థల్లో బోధన ఆటపాటలతో జరుగుతుందని, ఈ విధానం వల్ల విద్యార్థుల్లో శారీరక, మానసిక పెరుగుదల, ఆలోచన శక్తి, పరిశీలనా శక్తి, సామాజిక స్పృహ అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

సోలార్ వెలుగులపై నిర్లక్ష్యపు నీడ

- తుప్పు పట్టిన ఇనుప పైపులు, సోలార్ ప్లేట్లు
- లక్షల రూపాయల మెటీరియల్ దొంగలపాలు



మాయమైన సోలార్ లైట్ల ఐరన్ పైపులు (ఫైల్)

పరవాడ: తీరప్రాంతాల్లో వెలుగులు చిమ్మిన సోలార్ లైట్లపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో లక్షలాది రూపాయలను వెచ్చించి నిర్మించిన సోలార్ లైట్లను బిగించిన పైపులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో మత్స్యకార్మికులు, పర్యాటకుల సౌకర్యార్థం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఏడేళ్ల క్రితం లక్షల రూపాయల ఖర్చుతో సోలార్ లైట్లు సమకూర్చింది. ముత్యాలమ్మపాలెం తీరంలో 80 సోలార్ లైట్లు, తిక్కవానిపాలెం తీరంలో 80 సోలార్ లైట్లను ఏర్పాటు చేసింది. రాత్రివేళ చేపల వేటకు వెళ్లే మత్స్యకార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అయితే, ఆ వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. తీరం వెంబడి ఐరన్ పైపులు ఏర్పాటు చేసి, వాటికి సోలార్ లైట్లను అమర్చారు. తీరంలో ఉప్పు గాలి ప్రభావంతో ఇనుప పైపులతో పాటు సోలార్ ప్లేట్, లైట్లు కూడా తుప్పు పట్టి రాలిపోయాయి. ఇసుక కోతకు గురై, పలు చోట్ల కాంక్రీట్ దిమ్మలు నేలకు ఒరిగితే స్థానికులు పట్టుకుపోయారు.

ఐరన్ పైపులు మాయం

తిక్కవానిపాలెం తీరంలో నిన్న మొన్నటి వరకు తీరం పొడవునా ఉన్న ఐరన్ పైపులు ఉన్నట్టుండి మాయం కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఐరన్ పైపులను కోసి గుర్తు తెలియని వ్యక్తులు ఆపహరించుకుపోయారు. ప్రస్తుతం అక్కడ ఒక్క ఐరన్ పైపు కూడా లేదు. అంతకుముందు ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు అమర్చిన ఐరన్ పైపులనూ దొంగిలించుకుపోయారు. మాధవ స్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కొన్ని సోలార్ లైట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. సోలార్ లైట్ల అపహరణకు పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. బాధ్యులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని, మళ్లీ తీరంలో వెలుగులు ప్రసరించేలా చూడాలని కోరుతున్నారు.